
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
గురువారం 12 సెప్టెంబరు 2024




ధర్మవరం చెరువులో వినాయకుడి నిమజ్జనం

విద్యార్థులపై రసాయనం స్ప్రే

సోమందేపల్లిలో కలకలం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యుడు హరి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 11: సోమందేపల్లిలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో ఉన్న విద్యార్థులపై బుధవారం గుర్తుతెలియని బాలుడు కిటికీలోంచి రసాయనాన్ని స్ప్రే చేసి, పరారయ్యాడు. దీంతో విద్యార్థులు కళ్లమంట, నొప్పితో విలవిల్లాడారు. ఉపాధ్యాయులు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి హరికుమార్ వారిని పరీక్షించి, కళ్లకు ప్రమాదం లేదనీ, ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవన్ పాఠశాలలో ఆరాతీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్థానిక విద్యాశాఖాధికారులు, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఆ బాలుడు ఎవరు, రసాయనాన్ని ఎందుకు స్ప్రే చేశాడన్న విషయాలు తెలియరాలేదు.

ధర్మవరం పోదాం.. నకిలీ నోట్లు తెచ్చుకుందాం..

ఇరువురి ఫోన్ సంభాషణ ఆడియో వైరల్

పోలీసులు అప్రమత్తం

నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ





పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11: ధర్మవరం వెళ్లి నకిలీ కరెన్సీ తెచ్చుకుని, చెలామణి చేసుకుందామని ఓ డ్రైవర్.. మరొకరితో మాట్లాడిన ఫోన్ సంభాషణ ఆడియో వైరల్ అవుతోంది. రూ.50వేలు ఒరిజినల్ నగదుకు రూ.2 లక్షల నకిలీ నోట్లు ఇస్తారని అందులో పేర్కొన్నాడు. ఈ వ్యవహారంలో ఓ కానిస్టేబుల్ సహకారం అందిస్తాడని చెప్పడంతో పోలీసు యంత్రాంగం ఉలిక్కిపడింది. నిందితులను పెనుకొండ సర్కిల్ పోలీసు స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నట్లు తెలిసింది. పెనుకొండ వాసి సయ్యద్ మన్సూర్, సోమందేపల్లికి చెందిన డ్రైవర్ మంజునాథ్ ఫోన్‌లో నకిలీ కరెన్సీ చెలామణిపై మాట్లాడుకున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. డ్రైవర్ మంజునాథ్.. సయ్యద్ మన్సూర్‌కు ఫోన్ చేశాడు. రూ.50వేలు ఒరిజినల్ నగదు ఇస్తే రూ.2లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు ఇస్తారని చెప్పాడు. ధర్మవరం పరిసర ప్రాంతాలకు వెళ్తే వారే వచ్చి రూ.2లక్షల నకిలీ నోట్లు ఇస్తారని తెలిపాడు. మొన్న ధర్మవరంలో తెచ్చిన నకిలీనోట్లను వైన్‌షాపులో, ఇంటి అద్దె చెల్లించేందుకు, బ్యాంకులో కూడా మార్చానని చెప్పుకొచ్చాడు. ఒరిజినల్ కరెన్సీ ఎలా ఉంటుందో అచ్చం అలాగే ఉంటుందని వివరించాడు. ధర్మవరంలో నాగేష్ అనే కానిస్టేబుల్ ఉంటాడనీ, ఇలాంటి వాటికి సహకరిస్తాడని మాట్లాడుకున్న ఆడియో వైరల్ అయింది. దీనిపై అప్రమత్తమైన పోలీసులు.. ఫోన్‌లో మాట్లాడుకున్న వారిని అరెస్టు చేసే పనిలో పడ్డారు. దీనిపై పెనుకొండ సీఐ రాఘవన్‌ను అడగ్గా.. సోమందేపల్లికి చెందిన మంజునాథ్‌ను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిపారు.


వినాయక లడ్డుతో మౌలాసాబ్

వినాయక లడ్డూను దక్కించుకున్న ముస్లిం

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని పెద్ద బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఓ ముస్లిం దక్కించుకున్నారు. బుధవారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో పాలగిరి మౌలాసాబ్ రూ.1,05,116కి సొంతం చేసుకున్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి వినాయకుడి లడ్డూను శేఖర్ నాయుడు రూ.90వేలకు దక్కించుకున్నారు.


కదిరిలో గణేశుడి శోభాయాత్ర

బై.. బై.. గణేశా...

ఘనంగా వినాయక నిమజ్జనం

కదిరి, సెప్టెంబరు 11: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఐదురోజులపాటు గణనాథుడికి పూజలు చేశారు. కదిరి, ముదిగుబ్బ, లేపాక్షి, హిందూపురంలోని కొన్ని వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కదిరిలో బైపాస్‌రోడ్డులోని రామరామ కుంటలో నిమజ్జనం చేశారు. మొట్టమొదటగా పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆనవాయితీగా రైల్వేస్టేషన్ వద్దకు తరలించారు. అక్కడ పూజల అనంతరం మధ్యాహ్నం 2.15గంటలకు యాత్ర ప్రారంభమైంది. యాత్రలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, భక్తులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు మధ్యాహ్నంనుంచి రాత్రి పొద్దుపోయేవరకు కొనసాగింది. పెద్ద విగ్రహాలైన రైల్వే గణేష్, సింహకోట, ఎర్రకోట, శివాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రతిమలను చివరల్లో నిమజ్జనానికి తరలించారు. యువత కేరింతలు కొడుతూ, డ్యాన్సులు చేస్తూ, రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.


కదిరి: శోభాయాత్రలో వాయిద్యకారుల సందడి

సర్దుకో.. సామీ..

తాడిమర్రి: రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో వరదలు పోటెత్తుతుంటే మండలంలో మాత్రం నీరు కరువైంది. వినాయక ప్రతిమల నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తాయి. మండలంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను నిమజ్జనానికి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు తీసుకెళ్లాల్సి వస్తోంది. అంతదూరం తీసుకెళ్లలేని వారు ఓ గొయ్యి తీసి, అందులోకి నీరు నింపి, నిమజ్జనం చేయాల్సి వస్తోంది. పడమటి చెరువు సమీప గ్రామాల భక్తులకు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు నీరులేదు. దీంతో చెరువులోని ఒక గోతిలోకి మోటారు ద్వారా నీటిని నింపి, అందులో నిమజ్జనం చేయాల్సి వచ్చింది. ఏకపాదంపల్లి గ్రామస్థులు వినాయక ప్రతిమను కుంట వరకు తీసుకెళ్లి, అక్కడ మట్టి దిబ్బపై ఉంచి మమ అనిపించేశారు.


పడమటి చెరువులో మోకాలి లోతు నీటిలో మునగని వినాయకుడి ప్రతిమ

వరద బాధితులకు సత్యసాయి ట్రస్టు సేవలు

విజయవాడలో నిత్యావసర కిట్ల పంపిణీ


వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 11: వరదలకు తీవ్రంగా నష్టపోయి, నిరాశ్రయులైన విజయవాడ వాసులకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సాయం అందించింది. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం వరద బాధితులకు సరుకుల పంపిణీని ప్రారంభించారు. వరదప్రభావిత ప్రాంతాలైన న్యూరాజీవ్ కాలనీ, పాతరాజీవ్ కాలనీ, కొత్తరాజరాజేశ్వరి పేట, శాంతినగర్‌లోని 7 వేల కుటుంబాలకు అమృత కలశం (నిత్యావసర సరుకుల) కిట్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కోటేశ్వరరావు, సత్యసాయి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు చలం, సాయిప్రసాద్, 600 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో డమ్మీ తుపాకీతో హల్‌చల్

ఏడుగురిపై కేసు


పోలీసులు స్వాధీనం చేసుకున్న డమ్మీ తుపాకీ, తల్వార్

మడకశిర టౌన్, సెప్టెంబరు 11: మండలంలోని గుండుమల గ్రామంలో మంగళవారం రాత్రి పలువురు యువకులు నిషేధిత డమ్మీ తుపాకీ, తల్వార్‌ను ప్రదర్శించారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజకుమార్ తెలిపారు. బుధవారం మడకశిర సర్కిల్ కార్యాలయంలో యువకుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిషేధిత డమ్మీ తుపాకీ, తల్వార్‌ను నిమజ్జనం సందర్భంగా ప్రదర్శించడంపై పలువురు గ్రామస్థులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. డమ్మీ తుపాకీ, తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 11: జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి చేపట్టనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అపరిశుభ్రత కారణంగా రోగాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. పరిశుభ్రతకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామ, పట్టణ వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు, కార్యక్రమంలో డీపీఓ విజయ్‌కుమార్, డీఎల్‌డీఓ శివకుమారి పాల్గొన్నారు.

O/o Executive Engineer,APMSIDC MC Division, Penukonda in Sri Satya Sai District
Short Tender Notice No.02/EE/APMSIDC/MC Divn/Pkd/2024-25/Dt.11-09-2024
Tender are invited through 'e' Procurement plat form for work 1) Repairs & Renovation for standardization of D.H Hindupuram in Sri Satya Sai District Rs.40.00 lakhs. (5th Call) 2) Repairs & Renovation for standardization at A.H Dharmavaram in Sri Satya Sai District RS.23.50 lakhs (5th Call) . Further details can be seen in the 'e' Procurement market place at www.tender.apeprocurement. gov.in and display in Notice Board. Contact No.8297467436
sd/- Executive Engineer,APMSIDC, MC Division, Penukonda

పబ్లిక్ నోటీసు
మేము ఇక్కడ వ్రాసిన ("షెడ్యూల్ ప్రాపర్టీస్") షెడ్యూల్‌లో మరింత ప్రత్యేకంగా వివరించిన భూమి యజమానుల శీర్షికను పరిశీలిస్తున్నాము. విక్రయం, బదిలీ, మార్పిడి, అసైన్‌మెంట్, విల్, విడుదల, ఉపసంహరణ, డిక్రీ లేదా ఆర్డర్ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీస్‌లో లేదా దానిలోని ఏదైనా భాగంలో ఏదైనా వ్యక్తి హక్కు టైటిల్, దావా, ప్రయోజనం, డిమాండ్ లేదా ఆసక్తిని కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే ఏదైనా న్యాయస్థానం, భారం, తనఖా, లీజు, తాత్కాలిక హక్కు ఛార్జ్, నిర్వహణ, లైసెన్స్, బహుమతి, వారసత్వం, అవిభక్త వాటా, స్వాధీనం, సౌలభ్యం, ట్రస్ట్, బీక్వెస్ట్, సబ్ లీజు, అద్దె, ఉప-అద్దె, సెలవు మరియు లైసెన్స్, లిస్ పెండెన్‌లు, సౌలభ్యం, ఎంపికలు, మొదటి తిరస్కరణ హక్కు లేదా ఏదైనా స్వభావం లేదా ఇతరత్రా లేదా ఏదైనా, లేదా ఏదైనా ఒప్పందం కింద, దస్తావేజు, పత్రం లేదా న్యాయవాది యొక్క అధికారం లేదా ఏదైనా అభ్యంతరం/లు ఏ పద్ధతిలో అయినా తెలియజేయడం అవసరం ఈ నోటీసు తేదీ నుండి 10 (పది) రోజులలోపు క్రింద సంతకం చేసిన వారి క్రింద పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి, దానికి మద్దతుగా నోటరీ చేయబడిన/ధృవీకరించబడిన డాక్యుమెంటరీ రుజువు యొక్క నిజమైన కాపీలతో వ్రాతపూర్వకంగా, విఫలమైతే టైటిల్ యొక్క శీర్షిక అని భావించబడుతుంది. షెడ్యూల్ ప్రాపర్టీలు స్పష్టంగా, చెల్లుబాటు అయ్యేవి మరియు విక్రయించదగినవి మరియు షెడ్యూల్ ప్రాపర్టీలపై ఎవరికీ ఎలాంటి హక్కులు, టైటిల్, ఆసక్తి, దావా, డిమాండ్ ఉండవు. సపోర్టింగ్ డాక్యుమెంట్లు లేని ఏవైనా క్లెయిమ్‌లు స్వీకరించబడవు. దయచేసి మీ కవరుపై ఆంధ్ర ప్రదేశ్, శ్రీ సత్యసాయి అని గుర్తు పెట్టండి.

షెడ్యూల్ ప్రాపర్టీలు (భూమి యొక్క వివరణ)
ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లా, కనగానపల్లి, కంబదూరు తాలూకా, మద్దలచెరువు, రాళ్లపల్లి, గుళ్యం గ్రామాలు మరియు మరింత ప్రత్యేకంగా క్రింద వివరించబడిన సుమారు 74.75 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థిరాస్తి యొక్క మొత్తం ముక్క మరియు పార్శిల్:

స.నెం	గ్రామం / మండలం / జిల్లా	Sy. సంఖ్య.	యజమాని పేరు	మొత్తం పరిధి (ఎకరాలు)
1	మద్దలచెరువు/ కనగానపల్లి/ శ్రీ సత్యసాయి & రాళ్లపల్లి, గుళ్యం/ కంబదూరు/ అనంతపురం	257-1	క్యాస్ మల్లికార్జున	6.30
		257-1	క్యాస్ మాధవయ్య	6.80
2		366-3	వరదుల రమాదేవి	7.00
3		51-9	పెరుగు సుబ్బారెడ్డి	9.30
4		234-2	బంగారు నారక్క	5.00
		234-3	బోయ పోతన్న	5.00
5		222-1A	చీమల పోతన్న	5.00
		222-2A & 222-2C	కొండాపురం చెన్నమ్మ	5.59
6		233-1	చాపిడి రమేష్	5.00
		233-2	చాపిడి జ్యోతి	5.16
7		131-1	కె. సోమ సుందరరావు	14.60
		మొత్తం		74.75

సం/- **ప్రతాప్ పోగులకొండ**, న్యాయవాది, 8-2-120/86/9.303.3వ అంతస్తు, GK టైమ్స్ స్క్వేర్, ఎదురుగా, పార్క్ హయత్ హోటల్ బంజారా హిల్స్, రోడ్ నెం 2, హైదరాబాద్- 500034, తెలంగాణ, మొబైల్ నెం:8074532639, 9885207575
Email: vm305239@gmail.com, prataplawofficehyd@gmail.com

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.
గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు
ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారు ఆభరణాల యొక్క వేలంపాటను మేము **తేది. 19.09.2024** నాడు వేలం వేస్తాము. ఈ వేలములో రుణపెడికి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించుటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
DHVR1PJ2403210002	ASHLAM S	PNGD2PJ2403230004	M R UMADEVI
DHVR1PJ2403200001	ASHLAM S	PNGD2PJ2403070001	ANJANEYULU NAIK
DHVR1PJ2403180002	S VIJAY	PNGD2PJ2403090014	M LAKSHMI NARAYANA
DHVR1PJ2403060010	SHIK ABDUL RAHIM	PNGD2PJ2403260004	ZAKEER HUSSAIN TADIPATRI SYED
DHVR1PJ2403120002	ANJANEYULU	PNGD2PJ2402070005	M LAKSHMI NARAYANA
DHVR1PJ2403210003	SIVAIAH	PNGD2PJ2403110001	SURENDRA
HDPURPJ2403270002	HARIJANA SHANTHAMMA	PNGD2PJ2402210001	M LAKSHMI NARAYANA
KDIRIPJ2312150003	UPPUTHOLLA GANGADAR	PNGD2PJ2403180005	M LAKSHMI NARAYANA
KDIRIPJ2312150006	KUTAGAL ANJI	PNGD2PJ2403180001	KODAKANDLA NAGA VENI
KDIRIPJ2403300002	MUDDE RAJESH	PNGD2PJ2403150006	M LAKSHMI NARAYANA
PNGD2PJ2403130001	RAGHAVENDRA RAO		

క్రింద ఉదహరించిన చిరునామా వద్ద వేలం వేయడం జరుగుతుంది. **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,** D.NO.13/16&17, SRI VISHNUPRIYA COMPLEX,SUBHASH ROAD,NEAR TOWER CLOK,ANANTHAPURAMU-515001. **వేలం సమయం: 11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి,ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ N CHENGAL REDDY ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే,వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.
తేది: 11.09.2024
స్థలం : అనంతపురం
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పెద్దకర్మ



జననం: 17-02-1942
మరణం: 02-09-2024

కీ॥శే॥ శ్రీ పి.వి.చౌదరి గారు
మాజీ మండల అధ్యక్షులు(1987-1995), కొత్తచెరువు గ్రామం, శ్రీ సత్యసాయి జిల్లా.

కల్మషం లేక, ధర్మనిష్ఠతో, స్థితప్రజ్ఞతో, శ్రమైక సౌందర్యం ఆస్వాదించి, నిరాడంబరంగా సాఫల్యజీవనం సాగించిన శ్రీ పి.వి.చౌదరి గారు 82వ పడిలో 02-09-2024 న జీవితాతీత సౌందర్యం వైపు పయనమయ్యారు వారికి మా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

కుమారులు: పి.వి.ప్రసాద్, డా॥పి.వి.రాంప్రసాద్ M.D.ఫిజీషియన్
కోడళ్ళు: పి.వి.లక్ష్మి, పి.రమ్యజ్యోతి
కుమార్తె: సి. శ్రీదేవి
అల్లుడు : సి.శ్రీధర్ Director MITS, Hyderabad.

సిరి హాస్పిటల్, అనంతపురము

మనవళ్లు, మనుమరాళ్లు: పి.శ్రీహర్ష, ఎ.హేమంత్, పి.అభినవ్,సి.స్నేహ, సి.శ్రేయ,పి.సిరిఇషాని, పి.నిహిత
ముని మనుమరాలు: ఇషానా హేమంత్

పెద్దకర్మ
గురువారం 12 సెప్టెంబర్ 2024 ఉదయం 10 గం॥ల నుండి మా స్వగృహం కొత్తచెరువు గ్రామం నందు జరుపబడును. కావున తామెల్లరు విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని మనవి.

సంతాప సభ
గురువారం 12 సెప్టెంబర్ 2024 మధ్యాహ్నం 1 గం॥ల నుండి శ్రీరామ ఫంక్షన్ హాల్,ధర్మవరం రోడ్, కొత్తచెరువు గ్రామం నందు జరుపబడును.

తహసీల్దార్లకు పోస్టింగ్



అనంతపురం టౌన్, సెప్టెంబరు 11: ఎన్నికల తరువాత గాలిలో తేలియాడుతున్న తహసీల్దార్లకు కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చారు. బదిలీల సమయంలో కొందరిని స్థానిక ప్రజా ప్రతినిధులు వ్యతిరేకించారు. దీంతో వారు విధుల్లో చేరలేదు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పట్లో విధుల్లో చేరని ఏడుగురిని వేరే మండలాలకు కేటాయిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరిని జిల్లాకు తీసుకొచ్చారు. కొందరు బుధవారమే విధుల్లో చేరారు.

తహసీల్దారు	పాత స్థానం	కొత్త స్థానం
మోహన్‌కుమార్	కూడేరు	అనంతపురం రూరల్
రజాక్‌వలి	కలెక్టరేట్	తాడిపత్రి
ఉషారాణి	గుంతకల్లు ఆర్డీఓ	పెద్దవడుగూరు
భూషణం	పెద్దవడుగూరు	గుంతకల్లు ఆర్డీఓ
ఈశ్వరమ్మ	తాడిపత్రి	కళ్యాణదుర్గం ఆర్డీఓ
వాణిశ్రీ	అనంతపురం రూరల్	కలెక్టరేట్ కేఆర్ఆర్‌సీ
అలెగ్జాండర్	రాయదుర్గం	కలెక్టరేట్
ఖతిజున్‌కూబ్రా	శ్రీసత్యసాయి జిల్లా	కలెక్టరేట్
నాగరాజు	శ్రీసత్యసాయిజిల్లా	రాయదుర్గం

20న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

ఏడు నెలల తర్వాత నిర్వహణ

అనంతపురం విద్య, సెప్టెంబరు 11: జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను సుమారు ఏడు నెలల తర్వాత మళ్లీ నిర్వహించనున్నారు. కొంతకాలంలో జడ్పీ అధికారులు, పాలక మండలి సభ్యుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా సమావేశాలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు ఈ నెల 20న నిర్వహించాలని పాలక వర్గం, జడ్పీ అధికారులు నిర్ణయించారు. జడ్పీ ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఫైనాన్స్ అండ్ ప్లానింగ్, వర్క్, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో 10 గంటలకు విద్య-వైద్యం, మహిళ, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఆ సమయంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి వ్యవహారంపై పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. డిప్యూటీ సీఈఓను సరెండర్ చేయాలని డిమాండ్ చేసింది. సభ్యులు కింద కూర్చుని నిరసన తెలిపారు. సమావేశాలను బాయ్‌కాట్ చేశారు. నిబంధనల ప్రకారం సమావేశాలను వాయిదా పడిన మరుసటి రోజే నిర్వహించాలి. కానీ అధికారులు పట్టించుకోలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, సీఈఓ బదిలీ కావడం, డిప్యూటీ సీఈఓ పట్టించుకోకపోవడంతో సమావేశాల ప్రస్తావనే రాలేదు.

రండి.. ఉద్యోగాలిస్తాం..!

అనంతపురం ప్రెస్‌క్లబ్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాలకు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ సూచించారు. జేఎల్, పీజీటీ, టీజీటీ, పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులను డెమో ద్వారా, తాత్కాలిక ప్రాతిపదికన (గెస్ట్, పార్ట్ టైమ్) భర్తీ చేస్తామని తెలిపారు. జేఎల్‌కు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, పీజీటీకి పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, టీజీటీకి డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ (టీజీటీ హిందీకి డిగ్రీతో పాటు పీజీటీ ఉండాలి), పీఈటీకి బీపీఎడ్, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, హెల్త్ సూపర్‌వైజర్‌కి బీఎస్సీ నర్సింగ్ అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17న ఉదయం 11 గంటలకు కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. బాలుర పాఠశాలలకు పురుషులు, బాలికల పాఠశాలల్లో మహిళలకు మాత్రమే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

ఖాళీల వివరాలు

తిమ్మాపురం బాలికల పాఠశాల	: టీజీటీ గణితం, టీజీటీ హిందీ, పీఈటీ
నల్లమాడ బాలికల పాఠశాల	: టీజీటీ భౌతికశాస్త్రం, పీఈటీ
అమరాపురం బాలికల పాఠశాల	: పీజీటీ ఇంగ్లిష్
మలుగూరు బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ, టీజీటీ గణితం, టీజీటీ భౌతికశాస్త్రం
బి. పప్పూరు బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ
హిందూపురం బాలుర పాఠశాల	: టీజీటీ హిందీ
ఉరవకొండ బాలికల పాఠశాల	: జేఎల్ సివిక్స్
కణేకల్లు బాలుర పాఠశాల	: హెల్త్ సూపర్‌వైజర్

టమోటా కిలో రూ.26

అనంతపురంరూరల్, సెప్టెంబరు 11: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.14 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 23 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

తుంగభద్రం చేయండి

నిపుణుల కమిటీ సూచనలు అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 11: తుంగభద్ర డ్యామ్ భద్రతపై ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్ భద్రతపై జలవనరులశాఖ చేపట్టిన అధ్యయన బృందం ఇచ్చిన నివేదికను అమలు చేసేందుకు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలతో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లాకు ఉన్న ఏకైక నికర సాగునీటి వనరు తుంగభద్ర డ్యామ్ మీద ఆధారపడిన హెచ్చెల్సీ కాలవ మాత్రమేనన్నారు. డ్యామ్ పటిష్టత ప్రమాదంలో పడితే అందరికంటే ఎక్కువ నష్టం జరిగేది అనంతపురం జిల్లా రైతాంగానికి, ప్రజలకే అని పేర్కొన్నారు. డ్యామ్ భద్రతపై నిపుణుల అధ్యయన కమిటీ నివేదికపై రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు, నీటిరంగ నిపుణులతో సమావేశం జరిపి, తుంగభద్ర పరిరక్షణకు, హెచ్చెల్సీ ఆధునీకరణలు పూర్తి చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

అమరుల త్యాగాలను మరువలేం: డీఎఫ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ వినీత్ కుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 11: అమరుల త్యాగాలను మరువలేమని జిల్లా అటవీశాఖాధికారి వినీత్ కుమార్ అన్నారు. బుధవారం అటవీ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారికి ఘన నివాళులు అర్పించారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎఫ్ఓ పాల్గొని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. విధి నిర్వాహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రేంజర్లు శ్రీనివాసులు, డేవిడ్, డీఆర్వో దీప, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎఫ్ఓ

నీటి వనరులు నిర్వీర్యం

ఊసులేని హంద్రీనీవా విస్తరణ.. అటకెక్కిన హెచ్చెల్సీ ఆధునీకరణ

పీఏబీఆర్ సామర్థ్యం పెంపు అంతేనా?

నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్/రాయదుర్గం, సెప్టెంబరు 11: వైసీపీ హయాంలో జలవనరుల శాఖను నిర్వీర్యం చేశారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. ఈ రెండింటి నిర్వహణకు గడిచిన ఐదేళ్లలో పైసా ఇవ్వలేదు. టీడీపీ హయాంలో మంజూరైన పనులను నిలిపివేశారు. జీడిపల్లి నుంచి పేరూరు డ్యాం, బీటీ ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టులను అర్ధంతరంగా ఆపేశారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ సామర్థ్యం పెంపు గురించి పట్టించుకోలేదు. ఇది చాలదన్నట్లు వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి రెండు ఎకరాల హెచ్చెల్సీ స్థలాన్ని కేటాయించారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. రెండేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం కొనసాగుతోంది. ఇన్ని సమస్యల నడుమ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం గురువారం జరగనుంది. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఐఏబీ సమావేశానికి చైర్మన్ హోదాలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షత వహిస్తారు. జలవనరుల శాఖ ప్రధాన సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉంది.

ఆగిన ఆధునికీకరణ

హెచ్చెల్సీ ఆధునికీకరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. 2008-09లో రూ.458 కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. 2018 వరకు రూ.310 కోట్ల పనులు జరిగాయి. మిగిలిన రూ.148 కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటిని పూర్తి చేయాలంటే ప్రస్తుతం రూ.500 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తే 2600 క్యూసెక్కులు ఉన్న కాలువ సామర్థ్యాన్ని 4200 క్యూసెక్కులకు పెంచుకోవచ్చు. టీబీ డ్యాం నుంచి అదనంగా వరద నీటిని జిల్లాకు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

పీఏబీఆర్ నింపేది ఎన్నడు..?

జిల్లాలో అతిపెద్ద జలవనరు.. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్). దీని పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు. కానీ ఎప్పుడూ ఇంత నీటిని నిల్వ చేసింది లేదు. భూసేకరణ చేపట్టకపోవడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచకపోవడం దీనికి కారణం. పీఏబీఆర్ సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రూ.5 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసిన పుణెకు చెందిన కంపెనీ పేర్కొంది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 11 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి రూ.450 కోట్లు అవసరం. వరద నీటిని నిల్వ ఉంచేందుకు నిర్మించ తలపెట్టిన ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి రూ.4.8 కోట్లు అవసరం. వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.

భవనం ఏదీ..?

ఉమ్మడి జిల్లా నీటి నిర్వహణలో కీలకమైన హెచ్చెల్సీ కార్యాలయానికి సొంత భవనం లేదు. సుమారు 20 ఎకరాల సొంత స్థలం ఉన్నా.. భవనం నిర్మించుకోలేని దుస్థితిలో హెచ్చెల్సీ అధికారులు ఉన్నారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాల విస్తరణ కోసం ఖాళీ చేయించారు. హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ కార్యాలయాన్ని ఒక చోట, డిప్యూటీ ఎస్ఈ కార్యాలయాన్ని మరోచోట ఏర్పాటు చేశారు. సిబ్బంది, రికార్డుల కోసం ఒక గదిని కేటాయించారు. జలవనరుల శాఖ సీఈ కార్యాలయ భవన నిర్మాణం కోసం రెండెకరాల స్థలంలో ప్రహరీ నిర్మించారు. ఆ తరువాత వదిలేశారు. కానీ వైసీపీ జిల్లా కార్యాలయం కోసం రెండు ఎకరాలను నామమాత్రపు అద్దెకు 33 ఏళ్లకు కేటాయించారు. ఆ భవనాన్ని శరవేగంగా నిర్మించారు.

సిబ్బందిని నియమించాలి..



హెచ్చెల్సీ నిర్వహణకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నీటి సమస్య ఏర్పడితే రైతులమే పరిష్కరించుకోవాల్సి వస్తోంది. లస్కర్లు, ఇంజనీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేరు. బొమ్మనహాళ్ మండలంలో హెచ్చెల్సీకి జేఈఈ ఒక్కరే ఉన్నారు. ఉన్న లస్కర్లు కూడా అందుబాటులో ఉండరు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలంటే రైతులే తూము దగ్గరకు వెళ్లి ఎత్తుకోవాలి. కాలువలపై నిద్రించాలి. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి సమస్యను పరిష్కరించాలి.

-జనార్దనపల్లి రామాంజినేయులు, ఉద్దేహాళ్

హంద్రీనీవా కాలువ



విస్తరణ ఎన్నడు..?

హంద్రీనీవా కాలవ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం డ్యాం నుంచి 3850 క్యూసెక్కులు నీటిని తరలించేందుకు వీలుగా కాలువ ఉంది. ఎక్కువ నీటిని తక్కువ సమయంలో తరలించాలంటే కాలువ వెడల్పు పెంచాలి. లైనింగ్ వేయాలి. కాలువ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచాలని టీడీపీ హయాంలో ప్రభుత్వం నిర్ణయించింది. 2019లో కాలువ పటిష్టత పనులకు రూ.6182 కోట్లు కేటాయించింది. వైసీపీ వచ్చాక 2021లో టెండర్లు పిలిచి.. అంతటితో వదిలేశారు.

డిస్ట్రిబ్యూటరీలు ఎక్కడ..?

హంద్రీనీవా నీరు పొలాలకు చేరాలంటే పిల్ల కాలువలను (డిస్ట్రిబ్యూటరీలు) తవ్వాలి. ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటి విడతలో జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికోసం రూ.1500 కోట్లు అవసరమని డీపీఆర్‌ను ప్రభుత్వానికి పంపారు. ఈ ఫైల్‌ను తిరస్కరించినట్లు సమాచారం.

హెచ్చెల్సీ వెడల్పు పెంచాలి..



మా ప్రాంతంలో హెచ్చెల్సీ నీటి పైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. కొన్నేళ్ల నుంచి పాలకులు, అధికారులు హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయింది. కాలువను వెడల్పు చేసి, 2600 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా చేస్తే బాగుంటుంది. ఐఏబీ సమావేశంలో దీనిపై చర్చించాలి.

-రాముడు, కణేకల్లు

హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న నీరు



ఉంతకల్లు పనులు ప్రారంభించాలి..



బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద ఎన్ఏబీఆర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించాలి. తుంగభద్ర జలాశయం నుంచి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలి. తెలుగుదేశం ప్రభుత్వమే గతంలో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రిజర్వాయర్‌ను పూర్తి చేయించాలి.

-ఆంజనేయులు, దేవగిరి

మరమ్మతు చేయండి..



తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీరు సరిగా రావడం లేదు. అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలకు, ఆ తర్వాత పొలాలకు నీరు రావాలంటే సమస్యలను పరిష్కరించాలి. డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేయాలి. ఐఏబీ సమావేశాలలో మరమ్మతుల గురించి చర్చించాలి.

-మల్లేష్, కణేకల్లు

నేటి నుంచి రెండు ఆటలు

● దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు ● రెండు మ్యాచ్‌లు... నాలుగు జట్లు







అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: దులీప్‌ట్రోఫీలో భాగంగా బుధవారం నుంచి సెకండ్ రౌండ్ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా 12 నుంచి 15వతేదీ వరకు మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇండియా ఏ, బీ, సీ, డీ జట్ల ప్లేయర్లు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. గురువారం ఏసీజీ ఏ, ఏసీజీ బీ స్టేడియాల్లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా డీ జట్ల మధ్య, బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య సెకండ్ రౌండ్‌లో పోటీలు జరగనున్నాయి. పోటీలకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్‌లు ఏసీజీ ఏ, ఏసీజీ బీ మైదానాలను పరిశీలించారు. క్రీడాకారుల పెవిలియన్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఏసీజీ-ఏ మైదానంలోకి మాత్రమే ప్రేక్షకులను అనుమతిస్తారు. ఇందులో ప్రధానంగా పీఎంఏ గ్యాలరీలోకి ప్లేయర్లు తప్పా ఎవరూ అటువైపు వెళ్లకుండా నిషేధించారు. ఇక బ్లాక్ ఏ, బీ గ్యాలరీల్లో వీఐపీలు, ప్రజాప్రతినిధులు, బీసీసీఐ ప్రతినిధులకు ఏర్పాట్లు చేశారు. ఇక బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీల్లో ప్రేక్షకులు, విద్యార్థులకు అనుమతించారు. గేట్-1 నుంచి బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీలకు వెళ్లే ప్రేక్షకులకు ప్రవేశం ఉంటుంది. క్రీడాకారులు, వీఐపీలకు గేట్-2 నుంచి ప్రవేశం కల్పించారు. గేట్-3 నుంచి ఆర్డీటీ సిబ్బంది, నిర్వాహక సిబ్బందికి అనుమతి ఉంటుంది. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మహిళా జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ లాజిస్టిక్ మేనేజర్ గౌరీశంకర్, అడ్మిన్ మేనేజర్ ఆదిత్యవర్మ, మీడియా మేనేజర్ రాజగోపాల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ మహిళలకు పచ్చళ్లు, ఊరగాయలు, మసాలా పౌడర్, అప్పడాల తయారీపై ఈనెల 19 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పదిరోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉమ్మడి జిల్లాలోని 19-45 సంవత్సరాల వయస్సు గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479లను సంప్రదించాలని కోరారు.

బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు బుధవారం తెలిపారు. జూలైలో తృతీయ సంవత్సరం ఒకటి, రెండో సెమిస్టర్(ఆర్15,19)తోపాటు నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15,19) పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంబీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్17,21), ఎంసీఏ ఒకటో సెమిస్టర్(ఆర్20,21) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగో సెమిస్టర్(ఆర్20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏడు నెలల జీతాల విడుదల

పుట్టపర్తి, సెప్టెంబరు 11 : ఉమ్మడి జిల్లాలో శ్రీసత్యసాయి వాటర్‌ప్రాజెక్టు కార్మికులకు ఏడు నెలల జీతాలు విడుదలయ్యాయని కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు మధు, మురళి, చంద్ర, హరీష్, వేణుగోపాల్ బుధవారం పేర్కొన్నారు. రెండు నెలలుగా జీతాల కోసం పోరాటం చేశామని, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమ కష్టాలను పరిశీలించి జీతాల విడుదలకు కృషి చేశారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 536 మంది కార్మికులకు దాదాపు రూ. 30 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ సందర్భంగా వారు ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తాం

తేల్చిచెప్పిన తాగునీటి కార్మికులు.. అధికారులతో చర్చలు విఫలం



అధికారులతో చర్చలు సాగిస్తున్న యూనియన్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు11: తమ సమస్యలను పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని తాగునీటి సరఫరా పథకాల కార్మికులు స్పష్టం చేశారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ వద్ద వారం రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో బుధవారం ఇన్‌చార్జి డీపీఓ వసంతబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా చర్చలు సాగించారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామనీ, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సజావుగా నీటి సరఫరా సాగేలా చూడాలని తెలిపారు. అందుకు కార్మికులు ఒప్పుకోలేదు. సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని తేల్చిచెప్పారు. బుధవారం సమ్మెలో భాగంగా పీఏబీఆర్‌లో కార్మికులు జల దీక్ష చేపట్టారు. దీంతో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బయటకు రా.. ప్రైవేట్‌గా కలుద్దాం

ఎస్కేయూ విద్యార్థినికి లైంగిక వేధింపులు

వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడిపై కేసు



వసి కిరణ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11: వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం నాయకుడు వసి కిరణ్ అలియాస్ వాసు.. ఎస్కేయూ పీజీ విద్యార్థినిని వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై బుధవారం కేసు నమోదు చేశారు. గతంలో ఉన్న పరిచయాన్ని ఆసరగా చేసుకుని తనను వేధిస్తున్నాడని, బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, అతని ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ హేమంత్‌కుమార్ తెలిపారు. విషయం తెలియగానే వాసు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అనంతపురం నగరానికి చెందిన వాసు.. వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడిగా ఉన్నాడు. గతంలో ఎస్కేయూలోనే చదివాడు. ఇప్పటికీ ఎస్కేయూ హాస్టల్‌లోనే ఉంటున్నాడు. గత ఏడాది పీజీలో చేరిన విద్యార్థినిని కలిసిన సందర్భంలో ఫొటోలు తీసుకున్నట్లు సమాచారం. ఆ ఫొటోలను ఆసరాగా చేసుకుని మూడు నెలల నుంచి వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'బయటకు రా.. ప్రైవేట్‌గా రూమ్‌లో కలుద్దాం' అంటూ తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నాడని, ఫొటో తన తండ్రికి చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో చెప్పలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని పోలీసుల వద్ద ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 198063

కావలెను

ఎల్లుట్ల గ్రామం SUZLON సబ్‌స్టేషన్ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషన్ కావలెను. విద్యార్హత: ITI (or) Polytechnic సంప్ర. CELL No:9381838140

AJA-SATHISH

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గంగమ్మ ఒడిలోకి...

పలు ప్రాంతాల్లో ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం


కదిరిలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, నాయకులు


కదిరి సమీపంలో నిమజ్జనం చేస్తున్న సిబ్బంది


ముదిగుబ్బలో ఊరేగింపులో యువత హంగామా


బుక్కపట్నం మంజనాథ్ ఎస్టేట్ కాలనీలో స్వామి వారిని సాగనంపుతూ..


నల్లమాడలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


నంబులపూలకుంటలో వినాయకుడి ఊరేగింపులో యువత సందడి



చెరువంత నిర్లక్ష్యం..!

- వైసీపీ పాలనలో చెరువుల నిర్వహణ శూన్యం
- నీరు వస్తే గండ్లు పడే ప్రమాదం
- ఏపుగా పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక




నల్లచెరువు సమీపంలో ఉన్న కొత్తచెరువు కట్టపై, చెరువులో పెరిగిన ముళ్ల కంపలు


కంపచెట్లతో నిండిన ఎర్రగుంట చెరువు

నల్లచెరువు, సెప్టెంబరు 11: మండలంలో మొత్తం 56 చెరువులుండగా అన్నీ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువుల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఈ దుస్థితికి చేరుకున్నాయి. చెరువులో.. చెరువు కట్టపై... చెరువు కాలువల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు భారీగా పెరిగాయి. పూడిక తీయకపోవడంతో కాలువలు పూడిపోయే దశలో ఉన్నాయి. చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం నీరొస్తే... గండ్లు పడటం.. తెగిపోయే ప్రమాద ముందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో ముళ్ల పొదలు, పూడిక పేరుకుపోవడంతో వర్షపునీరు చెరువు చేరే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు.

దేవరింటిపల్లి కొత్తచెరువు, కాయలవాండ్లపల్లి చెరువు, పోలేవాండ్లపల్లి ఆవుల చెరువు, పత్రివాండ్లపల్లి చెరువు, పంతులచెరువు, కే.పూల కుంటచెరువు, ఉబ్బిచెర్ల చెరువు, పి.కొత్తపల్లి చెరువు తదితర చెరువు కట్టలు బలహీన పడ్డాయి. కె పూలకుంట చెరువు కట్ట కింద వంద ఎకరాలు, పంతులచెరువు కింద 120 ఎకరాలు సాగు చేస్తున్నారు. చెరువులో ముళ్ల కంపలు భారీగా పెరగడంతో.. నీటిసామర్థ్యం 30 శాతం తగ్గిందంటున్నారు. చెరువులో ముళ్లపొదలు తొలగిస్తే నీటి సామర్థ్యం పెరగడంతోపాటు చెరువులో చేపలు పెంచడానికి అనువుగా ఉంటుందని, దీని వలన పంచాయతీకీ అదనంగా ఆదాయం చేరుకుతుందని రైతులు అంటున్నారు.

ముళ్లపొదలు తొలగించాలి



చెరువులు, కట్టలు, కాలవల్లో పెరిగిన ముళ్లపొదలు తొలగించాలి. కట్టలపై ముళ్లకంపలు తొలగించకపోతే చెరువులకు గండి పడే ప్రమాదముంది. వెంటనే అధికారులు, నాయకులు స్పందించాలి. చెరువు నీటి సామర్థ్యం పూర్తిగా తగ్గిపోవడంలో ఆయకట్టు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది.

- వెంకటరమణారెడ్డి, చెరువువాండ్లపల్లి

వర్షపు నీరు వృథా



కాలువల్లో ముళ్ల కంపలు భారీగా పెరిగాయి. వర్షం నీరు చెరువుల్లోకి చేరడం లేదు. వృథా అవుతున్నాయి. చెరువులతో ముళ్ల కంపలు పెరిగిపోవడంతో వన్యప్రాణాలు చేరుతున్నాయి. చుట్టుపక్కల సాగుచేసిన పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలి.

-రెడ్డెప్ప, కల్లిపల్లి

సైబర్ నేరాల కట్టడిపై అవగాహన

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 11: అంతర్జాల మోసాలు, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు అడ్డుకోవడంపై స్థానిక శ్రీశక్తి భవన్‌లో ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌గ్రూమింగ్ ద్వారా అపరిచిత వ్యక్తులు ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, అనుచితమైన సందేశాలు పంపడం తదితర వాటి నుంచి పిల్లలను ఎలా కాపాడుకోవాలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, జిల్లా కో-ఆర్డినేటర్ అలెస్కో ఆనందబాబు, లలిత వివరించారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా ప్రతినిధి కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటక్షన్ ఆఫీసర్ మురళి, నాగలక్ష్మి, శిశుగృహ మేనేజర్ సునీత, సోషియల్ వర్కర్ ఆనంద్, యూడ్ అంబాసిడర్లు దేదీప్య, షెహతాజ్, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి

ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా


ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద గంగమ్మగుడి కాలనీవాసుల ధర్నా

కొత్తచెరువు, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని గంగమ్మగుడి కాలనీకి చెందిన పలువురు ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. తమ కాలనీకి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అదనంగా విద్యుత్ స్తంభాన్ని కూడా ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులను విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోలేదని అన్నారు. దీంతో తాము కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని, హై ఓల్టేజ్‌తో బల్బులు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని వాపోయారు. ఈ సమస్యలతో విసుగుచెంది ధర్నా చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరారు.

నాకెందుకు.. చిన్నితండ్రీ..!

- ధర్మవరంలో రియల్టర్ ఆత్మహత్య
- కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేకే..
- వినాయక ఉత్సవాల వేళ అఘాయిత్యం

నువులేని లోకం..

ఒక్కగానొక్క కొడుకు..
అల్లారుముద్దుగా పెంచుకున్నాడు..
బాబే ప్రపంచం అనుకున్నాడు..
కొడుకును చూసుకుని మురిసిపోయేవాడు..
విధి.. ఆ బిడ్డను కబళించింది..
వినాయక చవితి రోజే ఆ ఇంట చీకట్లు నింపింది..
ఈతకెళ్లి.. నీట మునిగి బిడ్డ మరణించాడు..
ఆ తండ్రి హృదయం కకావికలమైంది..
కుమిలి.. కుమిలి.. ఏడ్చాడు..
ఏడాదైనా నాన్న గుండె కన్నీరు కారుస్తూనే ఉంది..
మళ్లీ వినాయక చవితి వచ్చింది..
అందరి ఇంటా పండుగ సందడి నెలకొంది..
ఆ ఇంట మాత్రం చీకట్లు తొలగలేదు..
విషాద క్షణాలు వీడనేలేదు..
కన్న కొడుకులేని ఈ పండుగ
తనకెందుకు అనుకున్నాడు ఆ నాన్న..
బిడ్డలేని లోకంలో ఉండలేక..
వినాయక పండుగ వేళలోనే ప్రాణం తీసుకున్నాడు..
ఏడాదిలోనే బిడ్డను, భర్తను కోల్పోయి..
ఆ ఇల్లాలు కన్నీటిసంద్రంలో మునిగిపోయింది..


రజనీబాబు (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 11: ఒక్కగానొక్క కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక పట్టణంలోని ప్రియాంకనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రజనీబాబు (50) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రజనీబాబు, రామాంజినమ్మ దంపతులకు కుమారుడు నిశాంత్, కుమార్తె ఉండేవారు. రామాంజినమ్మ అగళి పీహెచ్‌సీలో నర్సుగా పనిచేస్తున్నారు. కుమార్తెకు వివాహం చేశారు. నిశాంత్ తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. ఒక్కడే కొడుకు కావడంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. నిశాంత్ గతేడాది వినాయక చవితి పండుగ రోజే ఈతకు వెళ్లి, నీటమునిగి మరణించాడు. కుమారుడి మరణాన్ని రజనీబాబు జీర్ణంచుకోలేకపోయాడు. కుమారుడిని తలచుకుని, తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. మళ్లీ గణేశ్ పండుగ వచ్చింది. అంతటా సంబరాలు చేసుకుంటున్నారు. రజనీబాబుకు మాత్రం చనిపోయిన కుమారుడే గుర్తుకొచ్చాడు. బిడ్డను తలచుకుని తీవ్రంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి స్థానికులు గమనించి, వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతేడాది కుమారుడిని, ప్రస్తుతం భర్తను కోల్పోయిన రామాంజినమ్మ కన్నీటి పర్యంతమైంది. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

తనకల్లు, సెప్టెంబరు 11 : మండలంలోని మల్లిరెడ్డి పంచాయతీలోని పెద్దపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు విరివిగా వాడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, కార్యకర్తలు శోభ, పద్మావతి, సుశీల, సుజాత పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

బత్తలపల్లి, సెప్టెంబరు 11 : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం వీఏఏలు, వీఎస్ఏలు, వీహెచ్ఏలకు పంటల బీమా, పంటకోత ప్రయోగాలపై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏఎస్ఓ శర్మ, ఏఓ ఓబిరెడ్డి మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవంనని హెచ్చరించారు. ప్రయోగాలు నిర్వహించిన వెంటనే ఈ-క్రాప్‌లో దిగుబడి నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలను పంపాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 11: హిందూపురం మండలం కొల్లకుంటలో వినాయక నిమజ్జనం సమయంలో మంగళవారం చోటుచేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వీ రత్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హిందూపురంలో శుక్రవారం నిర్వహించే వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

ధర్మవరం, సెప్టెంబరు 11: స్థానిక మోడల్ కాలేజ్‌లో బుధవారం శక్తిమైత్రిమహిళా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్, ప్రభుత్వ మోడల్ కాలేజ్ ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన

కదిరి(అమడగూరు), సెప్టెంబరు 11 : స్థానిక బస్టాండ్ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ చేతన్ బుధవారం పరిశీలించారు. నిర్వహణ సరిగా లేదంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద కేంద్రాలకు ఇప్పటివరకు జిల్లా పేరు మార్చకపోవడంపై ఆయన మండిపడ్డారు. అనంతరం స్థానిక సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం, వెలుగు, వ్యవసాయ గోదాములను ఆయన పరిశీలించారు. అనంతరం మహమ్మదాబాద్ సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిర్వాహణ సజావుగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కేంద్రాలు ఇలా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. కేంద్రం వద్ద మామిడి మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంపీడీఓ మునియప్ప, ఎంఈఓ జిల్లాన్ బాషా, ఏపీఎం, ఏపీఓ, ఏఈ గురురాజుగుప్త, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, అనిల్‌కుమార్, సుదర్శన్, సర్పంచ్ షబ్బీర్ ఉన్నారు.

ఓబుళదేవరచెరువు: చెత్త సంపద కేంద్రాలపై గ్రామకార్యదర్శులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. మండలంలోని ఆకుతోటపల్లి చెత్త సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చెత్త సంపద కేంద్రంలో నిలువ ఉన్న చెత్తను పరిశీలించారు. సంపద కేంద్రాలపై శ్రద్ధ చూపి, సంపదను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి రామలింగారెడ్డిని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పడక గదులను, ల్యాబ్, మందులను పరిశీలించారు. అలాగే నూతనంగా నిర్మించిన ల్యాబ్ గదులను పరిశీలించారు. ఆస్పత్రి భవనం కారుతోందని, పెచ్చులూడు తోందని, గతంలో నూతన వైద్యశాల మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకురాలేదని వైద్యులు కమల్ రోహిత్ కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట డీపీఆర్ఓ వేలాయుధం, ఉన్నారు.


అమడగూరులో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ చేతన్

నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ


నిమజ్జనం ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

కదిరి, సెప్టెంబరు 11: పట్టణంలోని వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రాంతాన్ని ఎస్పీ రత్న పరిశీలించారు. బుధవారం బందోబస్తులో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, ఆయా శాఖాధికారులను సూచనలు, సలహాలు ఇచ్చారు. క్రమపద్ధతిలో వినాయక ఊరేగింపు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం పూర్తి అయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో పొరపాట్లు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఆమె వెంట అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీలత, ఆవుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, సీఐలు నారాయణరెడ్డి, మోహన్, నాగేంద్ర, ఎస్ఐలు, ఆయా శాఖాధికారులు ఉన్నారు.

పోలీసుల కక్కుర్తి?

కదిరి, సెప్టెంబరు 11: పట్టణంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా కొందరు పోలీసులు డబ్బు వసూలు చేసినట్లు తెలిసింది. పట్టణంలో గణేశ్ నిమజ్జనానికి చుట్టుపక్కల ప్రాంతాల పోలీసులనూ భద్రత కోసం నియమించారు. అందులో భాగంగా కదిరికి వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టణంలోని ఓ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్దకెళ్లి రూ.రెండు వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేదంటే పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని బెదిరించినట్లు చర్చ సాగుతోంది. దీంతో మండప నిర్వాహకులు తమ వద్ద ఉన్న రూ.వెయ్యిని వారికిచ్చారని తెలిసింది. విషయాన్ని అక్కడి యువత సోషల్ మీడియాలో మెసేజ్ చేసింది. అది వైరల్ కావడంతో స్పందించిన పోలీసు అధికారులు.. ఆ కానిస్టేబుళ్లకు చీవాట్లు పెట్టి.. ఆ నిర్వాహకుల నుంచి తీసుకున్న రూ.1000 వెనక్కు ఇప్పించినట్లు తెలిసింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులను అడగ్గా.. అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా

ముదిగుబ్బ, సెప్టెంబరు 11 : మండలంలోని గంగిరెడ్డిపల్లి సమీపంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వాహనం బుధవారం రాత్రి అదుపు తప్పి బోల్తా పడింది. కొడవండ్లపల్లి ఇసుక రీచ్ నుంచి అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వాహనం గంగిరెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి అదుపు తప్పింది. రోడ్డు పక్కకు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ సలీం గాయపడ్డాడు.

వైసీపీ నాయకుడిపై దాడి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని ఏలుకుంట్ల గ్రామ గ్రామ సర్పంచ్ గుట్టూరు గంగమ్మ కుమారుడు వైసీపీ నాయకుడు గుట్టూరు రమేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి రాళ్లతో దాడిచేశారు. ధర్మవరం నుంచి ఏలుకుంట్ల గ్రామానికి ద్విచక్రవాహనంలో రాత్రి వస్తుండగా... గ్రామసమీపంలోని చెరువుకట్ట వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లను అతనిపై విసిరేశారు. దీంతో అతని తలకు గాయమైంది. చీకట్లో వారిని గుర్తించ లేకపోయానని బాధితుడు తెలిపాడు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. పది రోజుల క్రితమే గ్రామంలో తనపై దాడికి యత్నించారని, తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

నల్లమాడ, సెప్టెంబరు 11 : వరద బాధితుల కోసం మండలంలోని చౌటకుంటపల్లిలో టీడీపీ నాయకులు బుధవారం ఇంటింటికి వెళ్లి బియ్యాన్ని సేకరించారు. దాదాపు ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని గ్రామస్థులు విరాళంగా సేకరించినట్లు వారు తెలిపారు. ఆ బియ్యాన్ని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్‌కు అప్పగించామని, చిన్నగ్రామంలో ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగా ఇచ్చిన ఆ గ్రామస్థులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చందనాబాబు, నాగరాజు, నిజాంవలీ, దస్తగిరి వలీ, సలీమ్‌బాషా, బాబావలీ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


చౌటకుంటపల్లిలో వరద బాధితులకు బియ్యం సేకరిస్తున్న నాయకులు

గసికవారిపల్లిలో పొలంబడి

బుక్కపట్నం, సెప్టెంబరు 11 : మండలంలోని గసికవారిపల్లిలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ... అతి తక్కువ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడి నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు సేంద్రీయ ఎరువులైన జిప్సమ్, వేప నూనెను పంటలకు వినియోగించాలన్నారు. బ్యాక్టీరియా, మచ్చ తెగుళ్ల నివారణకు కాపర్ యాక్సిక్లోరైడ్, స్ట్రెప్టోమైసిన్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సతీష్‌బాబు, ఏఈఓలు సునీత, సుధాలక్ష్మీ, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

14న చేనేతల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం

ధర్మవరం, సెప్టెంబరు 11: చేనేతల సమస్యలపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలోని కదిరిగేటు సమీపంలోని బ్రహ్మంగారిదేవాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, చేనేత కార్మికులతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని, చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న జీఆర్‌సిల్క్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని.. తదితర అంశాలపై ఆ సమావేశంలో చర్చిస్తామన్నారు. గురువారం జేఆర్ సిల్క్ ఫ్యాక్టరీ వద్ద నిర్వహించాల్సిన ధర్నా వాయిదా వేశామనీ, ఎప్పుడు ధర్నా ఉంటుందో మళ్లీ ప్రకటిస్తామని అన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

తాడిమర్రి, సెప్టెంబరు 11: తాడిమర్రి రైతు సేవాకేంద్రంలో రైతులకు 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి రైతు సేవా కేంద్ర సిబ్బంది విజయ్, గౌతమి పాల్గొన్నారు.



కోలాహలంగా నిమజ్జనం



కోడిపల్లిలో వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న కళాకారులు



అభయాంజనేయ వినాయకుడు



యువతుల కేరింత

హిందూపురం, సెప్టెంబరు 11: హిందూపురం నియోజకవర్గంలోని రూరల్ మండలం, చిలమత్తూరు మండలాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. హిందూపురం మండలంలో బుధవారం ఒక్కరోజే 50 విగ్రహాలు నిమజ్జనం చేశారు. లేపాక్షి మండలంలో 15 విగ్రహాలు, చిలమత్తూరు మండలంలో 20విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. లేపాక్షి మండలం కోడిపల్లిలో జరిగిన నిమజ్జనం సందర్భంగా కళాకారులు వివిధ రూపాల్లో ఊరేగింపుగా వెళ్లారు. హిందూపురం డీఆర్‌కాలనీలో అభయ ఆంజనేయ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ముద్దిరెడ్డిపల్లి, సడ్లపల్లి, చౌళూరు, సంతేబిదునూరు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమం జరిగింది.

లేపాక్షి: వినాయక నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండపాల్లో ఐదురోజులుగా పూజించిన గణేష్ విగ్రహాలను ట్రాక్టర్లలో ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తూ యువకుల కేరింతల మధ్య నిమజ్జనాన్ని నిర్వహించారు. డీజేలు, డ్రమ్స్‌ల మధ్య యువత నాట్యాలు చేస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం లేపాక్షి పెద్దచెరువులో నిమజ్జనం నిర్వహించారు.

హిందూపురం(సోమందేపల్లి): మండలంలోని పత్తికుంటపల్లి, చల్లాపల్లి, రంగేపల్లి గ్రామాల్లో బుధవారం వైభవంగా వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగింది. ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను ఊరేగిస్తూ బాణసంచా కాల్చుతూ నృత్యాలు చేసుకుంటూ నిమజ్జనానికి తీసుకెళ్లారు. సమీప చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పెనుకొండ: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తూ భోగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. స్వామి వారి లడ్డూను వేలం వేయగా కురుడి నరసప్ప కుటుంబ సభ్యులు రూ.6,100కు, పూలహారాన్ని కట్టం వెంకటరత్నం రూ.6వేలకు దక్కించుకున్నారు.

మడకశిర రూరల్: మండంలోని భీమరాయణపల్లిలో గణేష్ నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. వినాయక విగ్రహాన్ని గ్రామం వీధుల్లో ఊరిగించి గ్రామ సమీపంలోని నీటి కుంటలో నిమజ్జనం చేశారు.



కోలాహలంగా నిమజ్జనానికి తరలింపు(లేపాక్షి)



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు (పెనుకొండ)

వచ్చే ఐదేళ్లలో హేమావతిని అభివృద్ధి చేస్తాం: గుండుమల

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 11: రాబోవు ఐదు సంవత్సరాల్లో హేమావతి, లేపాక్షి, పుట్టపర్తి, కదిరి ప్రాంతాలను చారిత్రాత్మక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని మాజీ ఎమ్మెల్సీ గుండల తిప్పేస్వామి పేర్కొన్నారు. హేమావతి గ్రామ బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వేలల్లో భక్తులు వచ్చే విధంగా హేమావతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీలో ఉండే 9 గ్రామాలలో సిమెంట్‌రోడ్లు, జలజీవన్‌మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబును ఆదేశించారు. వచ్చే నెల మొదటి వారంలో పురావస్తు శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీలను పిలిపించుకొని హేమావతి గ్రామాన్ని పూర్తిగా చూపించి అభివృద్ధికి సహకరించాలని కోరుతామన్నారు. మండల కన్వీనర్ గణేష్, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, ఐటీడీపీ ఉపాధ్యక్షులు రామచంద్రప్ప, కుమారస్వామి, ఓంకార్‌స్వామి, తిప్పజ్జ, శివకుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

హెచ్ఐవీ నివారణపై అవగాహన



పోస్టర్ విడుదల చేస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 11: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ అశ్వత్థనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శకుంతల హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యుఎస్ లలిత, నాగేశ్వరి, ఉపాధ్యాయులు రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వారు రెచ్చగొట్టడం వల్లే ఘర్షణ: సీఐ

హిందూపురం, సెప్టెంబరు 11: కొల్లకుంటలో మంగళవారం జరిగిన సంఘటనకు వైసీపీకి చెందిన శివశంకర్‌రెడ్డి కుటుంబ మహిళలు దుర్భాష లాడటమే కారణమని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సోమవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. వెంటనే అక్కడకు చేరుకుని పోలీసులు సర్దిచెప్పారు. అయినా వైసీపీ నాయకులు శివశంకర్‌రెడ్డితో ఫిర్యాదు చేయాలని సూచించగా మేము రాజీ అయ్యామని చెప్పారన్నారు. అర్ధరాత్రి పోలీస్ పికెట్ తొలగించారు. కానీ మంగళవారం మరోసారి వైసీపీ నాయకుడి కుటుంబానికి చెందిన మహిళలు అటుగా వెళ్లేవారిపై దుర్భాషలాడుతుండటంతో గొడవ జరిగింది. నవీన్, మంజు మరో ముగ్గురు తిరగబడ్డారన్నారు. గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించామన్నారు. ఇరువర్గాల మీద కేసు నమోదు చేశామన్నారు.

రేపు క్రీడా పోటీలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 11:

సోమందేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఈనెల 13న అండర్-14, అండర్-17 క్రీడా పోటీలను నిర్వహిస్తామని ఎంఈఓ ఆంజనేయులు నాయక్ తెలిపారు. ఆదిశగా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెలెక్షన్ చేపడుతున్నట్లు తెలిపారు. సోమందేపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను నియోజకవర్గస్థాయికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ తదితరవాటిపై ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యార్థులకు ఎంపికచేసి శిక్షణ ఇవ్వాలని కోరారు. 13న ఉదయం 9గంటలకు క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయని వారు తెలిపారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు: డీఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 11: గణేష్ నిమజ్జనం సందర్భంగా హిందూపురంలో శుక్రవారం ట్రాఫిక్‌కు మళ్లించామని డీఎస్పీ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు వైపు నుంచి అనంతపురం, మడకశిర, పెనుకొండకు వెళ్లే వాహనాలు ఆటో నగర్, రహమత్‌పురం సర్కిల్, లేపాక్షి రోడ్డు మీదుగా వెళ్లాలి. మడకశిర వైపు వెళ్లే వాహనాలుంటే హైవే మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. మడకశిర నుంచి వచ్చే వాహనాలు ఆర్టీసీ బస్సులు సేవామందిరం క్రాస్ వరకే అనుమతిస్తామన్నారు. అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లాల్సి ఉంటుందన్నారు. లేపాక్షి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులకు హైవేమీదుగా కొట్నూరు వరకు అనుమతి ఉందన్నారు. గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలను కొట్నూరు క్రాస్‌వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సులు, లారీ, కార్లు, పట్టణంలోకి అనుమతించబోమని, నిబంధనలు అతిక్రమించి వస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. హిందూపురం పట్టణంలో నిమజ్జన కార్యక్రమానికి 1200మంది పోలీసులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఉలవ సాగు చేయండి

మండల వ్యవసాయ అధికారి మంజునాథ్

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 11: ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ సూచించారు. పొలాలను దుక్కి చేసుకొని పంటలు వేయని వారికి ప్రత్యామ్నాయ పంటగా ఉలువలకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ అందిస్తుంది. ఈమేరకు సాగు చేసుకొనేందుకు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకొన్న రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి మంజునాథ్ తెలిపారు. పది కిలోల ఉలువలు ధర రూ.870 ఉండగా 80 శాతం రాయితీతో రూ.696 పోగా రైతులకు కేవలం రూ.174లకే పంపిణీ చేస్తామన్నారు. కావున మండలంలోని దుక్కిదున్ని పంటలు వేయని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ తెలిపారు.

న్యాయం చేయండి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి న్యాయం చేయాలని ఆయన బంధువులు బుధవారం రొద్దం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రొద్దం మండలంలోని కంచిసముద్రం వద్ద మూడు రోజుల కిందట ఆటో బోల్తా పడి, శ్రీరాములు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బెంగళూరులో చికిత్సపొందుతున్నాడు. తమకు న్యాయం చేయాలని శ్రీరాములు అన్న నాగలింగప్ప, బంధువులు రొద్దం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ లోచర్ల గ్రామానికి చెందిన శ్రీరాములు నాగులమడకలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జరిగే బంధువుల పెళ్లి కోసం ఎల్‌జీబీనగర్‌వద్ద ఆటోఎక్కి ప్రయాణిస్తుండగా కంచిసముద్రం వద్ద అది బోల్తా పడిందన్నారు. ఆటోడ్రైవర్ చాకలి కిష్టప్ప మద్యం సేవించి నడుపడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు రెండు కాళ్లు, నడుం విరిగి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్నాడన్నారు. ఆటోడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు రొద్దం పోలీసులు తెలిపారు.

అధికారం ఇచ్చింది అరాచకాలు చేయడానికా..?

మాజీ మంత్రి ఉష శ్రీచరణ్

హిందూపురం, సెప్టెంబరు 11: కూటమి ప్రభుత్వానికి భారీ మెజార్టీ ఇచ్చింది అరాచకాలు చేయడానికేనా అని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం ఇరువర్గాల ఘర్షణలో గాయపడ్డ వైసీపీ కార్యకర్తలను ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆమె పరామర్శించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో నల్లరిబ్బన్ ధరించి బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఉష శ్రీచరణ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాత్రే అదుపులోకి తీసుకున్నామని సీఐ రాజగోపాల్ తెలిపారు. కూటమి నాయకులు ఇలాంటి అఘాయిత్యాలు, అరాచకాలకు స్వస్తిపలకాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని పోలీసులను కోరారు. వీరివెంట నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మునిసిపల్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు వేణురెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. వైసీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు.



ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఉష శ్రీచరణ్, దీపిక

డంపింగ్ యార్డు తనిఖీ



డపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గోరంట్ల, సెప్టెంబరు 11: పట్టణంలో రావికుంటచెరువు వద్ద గల డంపింగ్‌యార్డును కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం తనిఖీ చేశారు. షెడ్‌ను పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల సేకరించిన చెత్తను వేరు చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడారు. వారి వేతనం, విధుల గురించి ఆరా తీశారు. డపింగ్ యార్డు నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఆయన వెంట పుట్టపర్తి డీఎల్‌పీఓ శివకుమారి, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, సచివాలయాల కార్యదర్శులు బాబురావు, రవి, సురేష్, సౌమ్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 11: మండలంలోని గణపతిపల్లి గ్రామానికి చెందిన వివాహిత గౌతమి(21) నీటికుంటలో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు గ్రామానికి చెందిన మరో యువతితో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన నరసింహప్ప భార్య గౌతమి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నీటిలో తేలియాడు తున్న మృతదేహాన్ని బయటికి తీసి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త మూడు రోజుల నుంచి గౌతమి కనబడటం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇదివరకే ఫిర్యాదు కూడా చేశారు. మృతురాలికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు.

ఆలయాన్ని సందర్శించిన అధికారులు



ఆలయంలో అధికారులు

గోరంట్ల, సెప్టెంబరు 11: జిల్లా భూ, సర్వేశాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ హరికృష్ణ, ఏడీ రామకృష్ణ గోరంట్లలోని మాధవరాయ దేవాలయాన్ని బుధవారం సందర్శించారు. విజయనగర రాజుల కాలం నాటి పురాతన ఆలయంలోని శిల్పకళను పరిశీలించి, ఆలయ విశిష్టతను తెలుసుకుని, పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టర్ అంజలిదేవి, టీఎఫ్ సర్వేయర్ కరుణాకర్, విలేజీ సర్వేయర్ నరేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ జనార్దన్, పురోహితులు నరహరి, నూరి, రామప్ప పాల్గొన్నారు.

వరద బాధితుల కష్టాలు కలచి వేశాయి



బాధితులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 11: ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన వారి కష్టాలు ఆవేదన కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. విజయవాడ 55వ డివిజన్ పరిధిలో తన సొంత నిధులతో 2500 మందికి బుధవారం ఆయన చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత, నేతలు బాధితులకు అండగా నిలవాల్సిందిపోయి రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వరద బాధితులకు అండగా ఉంటుందన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు(65) మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రైలుపట్టాలపై మృతదేహాన్ని చూసి రైల్వే కీమన్ తమకు సమాచారం ఇచ్చినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం, సెప్టెంబరు 11: తపాలాశాఖలో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మాస్టర్ మార్కెండేయ అన్నారు. బుధవారం అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలపై న్యాయవాదులు, సిబ్బందికి వివరించారు. రూ549 చెల్లిస్తే రూ.10లక్షల బీమా సౌకర్యం ఉందన్నారు. రూ.749 చెల్లిస్తే రూ.15లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయడానికి తపాలా శాఖలో అవకాశం ఉందన్నారు. పోస్టల్ బీమా పథకం అన్ని వర్గాలకు అందుబాటులో ఉందన్నారు. ముఖ్యంగా పీఎంజేజేవై పథకం కింద యేడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2లక్షలు బీమా అందిస్తుందన్నారు.కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులపై మ్యాప్‌ను పరిశీలిస్తున్న సర్వేయర్, టీడీపీ నాయకులు

పెనుకొండరూరల్, సెప్టెంబరు 11: పెనుకొండ-కోనాపురం రహదారిలో డ్రైనేజీ పనులను బీసీసంక్షేమ శాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. రెండ్రోజుల క్రితం మడకశిర, కోనాపురం రహదారిలో కల్వర్టు బ్లాక్ కావడంతో ఎగువ నుంచి వచ్చే మురుగునీరంతా రోడ్డుపై రావడంతో అపరిశుభ్రంగా మారింది. స్పందించిన మునిసిపల్, రెవెన్యూ అధికారులు టీడీపీ నాయకులు అప్రమత్తమై కోనాపురం వెళ్లే రహదారికి మురుగునీరు రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం యుద్ధ ప్రాతిపదికన రెవెన్యూ అధికారులతో మంత్రి భర్త వెంకటేశ్వర్‌రావు కల్వర్టు డ్రైనేజీ పనులపై పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కోదండపాణి, టీడీపీ నాయకులు మైనార్టీ యువనాయకుడు దాదు, నరేష్, కోనాపురం రామలింగ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

15న సాహితీవేత్తల సమ్మేళనం

గోరంట్ల, సెప్టెంబరు 11: పట్టణంలోని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో ఈనెల 15న సాహితీ సంస్కృతిక కళా రంగాల వారితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు నర్రెడ్డుల రాజారెడ్డి, సుధాకర్, దేవాంగం జగదీశ్వర్లు బుధవారం ఓప్రకటనలో పేర్కొన్నారు. గోరంట్ల సాహితీ, సంస్కృతికి వేదిక పేరుతో మండలంలో వివిధరంగాల్లో ప్రతిభ కలిగినవారిని ప్రోత్సహించడం కోసం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఆయా రంగాలపై అభిరుచి కలిగిన వారు ఆదివారం ఉదయం 10గంటలకు జరిగే ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు.

11మంది బైండోవర్

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 11: మండలంలోని కావేటి నాగేపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 11మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్సీ కాలనీకి చెందిన పలువురు గ్రామంలో నిమజ్జనం అనంతరం ఘర్షణకు దిగి రాళ్లు రువ్వుకున్నారన్నారు. దీంతో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగడమేకాక పలువురు గాయపడినట్లు ఆయన తెలిపారు. ఈక్రమంలోనే వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ గురువారం నుంచి నిర్వహిస్తామని మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబసభ్యులు తెలిపారు. మాజీ ఎంపీ శ్రీరామరెడ్డి 119వ జయంతి సందర్భంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఐదు మండలాల్లోని 68 ఉన్నత పాఠశాల విద్యార్థులు పోటీలో పాల్గొంటారని తెలిపారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే చెకుముకి

మడకశిరటౌన్, సెప్టెంబరు 11: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చెకుముకి టాలెంట్ టెస్టులు ఎంతగానో దోహద పడతాయని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు వాల్ పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈనెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 11: మండలంలో పంట కోత ప్రయోగాలను ఎలా చేపట్టాలనే అంశంపై రైతుసేవ కేంద్రాల అధికారులకు బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఏఓ కవితా రాణి ఆధ్వర్యంలో వీఏఏ బాలకృష్ణ గ్రామ సర్వేయర్ శివ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంట వేసిన ప్రతి రైతు రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేయించుకునేలా అధికారులు చూడాలని పేర్కొన్నారు. మండలంలో 42 రైతు సేవా కేంద్రాలుండగా ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న రైతులకు అవగాహన కల్పించి పంటకోత ప్రయోగాలు చేసేలా చూడాలని తెలిపారు.

పకడ్బందీగా నిర్వహించాలి

గుడిబండ, సెప్టెంబరు 11: రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది, రాగి, మొక్కజొన్న, తదితర పంట సాగులో పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలని పుట్టపర్తి డీవైఎస్ఓ మల్లికార్జున, ఏఓ వీర నరేష్ పేర్కొన్నారు. గుడిబండ వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు ఆర్బీకే సిబ్బంది, ఏఈఓలు, ఎంపీఈఓలు, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారికి సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రమణ, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న బీజేపీ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు11: వరద బాధితుల సహాయార్థం గుప్పెడు దానం పేరుతో బీజేపీ చేపట్టిన విరాళాల సేకరణ రెండోరోజు కొనసాగింది. బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ గోపీనాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు రామక్రిష్ణ, రామాంజినేయులు, రవి, సూరి తదితరులు పట్టణంలోని ఎగువగడ్డ, పాత పోస్టాఫీసు, చెరువురోడ్డు, తోటగేరి, బ్రాహ్మణవీధి, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి నిత్యవసర వస్తువులు, దుస్తులు తదితరవాటిని సేకరించారు.

మణూరు తండాలో విజృంభించిన జ్వరాలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని మణూరుతండాలో జ్వరాలతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. తండాలో 350 మంది ప్రజలు ఉన్నారు. గత నాలుగు రోజులగా తండాలో జ్వరాలు విజృంభిస్తున్నట్లు తెలిపారు. జనార్దన్ నాయక్ సాకమ్మ, కవిత, భారతి, మాట్లాడుతూ తండాలో అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వ్యాప్తి చెంది చాల మందికి జ్వరాలు వ్యాపింపజేస్తున్నట్లు తెలిపారు చిన్నారులకు జ్వరాలు సోకడంతో పాఠశాలకు కూడా వెళ్లడం లేదన్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసునుకోవాలని తాండవాసులు కోరుతున్నారు.

మద్యం అక్రమ రవాణా.. మూడేళ్ల జైలు

గోరంట్ల, సెప్టెంబరు 11: మద్యం అక్రమ రవాణా కేసులో షేక్ నూర్‌మహమ్మద్‌కు పెనుకొండ ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం మూడేళ్ల జైలు, రూ. రెండు లక్షల జరిమానా విధించిందని గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు. కడప జిల్లా సింహాద్రిపురానికి చెందిన షేక్ నూర్‌మహమ్మద్ 2020 జూలై 18న కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా సీఐ జయనాయక్ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. 2021 జూలైలో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, కోర్టులో విచారణ జరిగింది. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, ఏపీపీ శ్యామల, వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో జడ్జి బొజ్జప్ప తీర్పు ఇచ్చారు.